

మచిలీపట్నం నియోజకవర్గంలో వైసీపీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. నియోజకవర్గంలో ఆ పార్టీకి చెందిన బీసీ నాయకులు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ సమక్షంలో మంగళగిరి కేంద్ర కార్యాలయంలో సోమవారం పార్టీలో చేరారు. బందరు నుంచి వెయ్యి మంది వాహనాలతో ర్యాలీగా వెళ్లి చంద్రబాబును కలిశారు. పెనమలూరు శాసనసభ్యుడు కొలుసు పార్థసారథి, ఎంపీ వల్లభనేని బాలశౌరికి అనుచరులుగా ఉన్న వీరంతా టీడీపీలో చేరడంతో, యాదవ సామాజికవర్గంలో అధికశాతం కార్యకర్తలు, నాయకులు వైసీపీని ఖాళీ చేసే పరిస్థితి ఏర్పడింది.



రొండి కృష్ణయాదవ్‌కు పార్టీ కండువా కప్పుతున్న టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు

బందరు వైసీపీకి బీసీల ఝలక్

- వెయ్యి మందితో మచిలీపట్నం నుంచి మంగళగిరి టీడీపీ కార్యాలయానికి ర్యాలీ
- వారితోపాటే కొలుసు పార్థసారథి, ఎంపీ బాలశౌరి అనుచరులు పయనం
- గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కృష్ణయాదవ్, కార్పొరేటర్ భర్త, పలు గ్రామాల బీసీలు మూకుమ్మడిగా టీడీపీలోకి...

చంద్రబాబు సమక్షంలో బీసీ నాయకులు టీడీపీలో చేరిక

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రొండి కృష్ణయాదవ్, 40వ డివిజన్ కార్పొరేటర్ నాలి శారద భర్త మాధవ, బందరుకోటకు చెందిన మాజీ కౌన్సిలర్ బొర్రా చిన్న, మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 50 డివిజన్‌లలోని, బందరుకోట, నెలకుర్రుగొల్లపాలెం, రుద్రవరంగొల్లపాలెం, మంగినపూడి, పెదపట్నం, తాళ్లపాలెం, పెదయాదర గ్రామాలకు చెందిన యాదవ సామాజిక పెద్దలు, యువకులు మొత్తం వెయ్యిమందికిపైగా భారీ ఊరేగింపుతో మచిలీపట్నం నుంచి మంగళగిరికి తరలివెళ్లారు. పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథితో పాటు రొండి కృష్ణయాదవ్, నాలిమాధవ, బొర్రా చిన్నా తదితరులను చంద్రబాబునాయుడు పార్టీ కండువా కప్పి పార్టీకిలో ఆహ్వానించడంతో మచిలీపట్నంలో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది.

వేధింపుల వల్ల ఇమడలేకే..

మచిలీపట్నం నియోజకవర్గంలో యాదవ సామాజిక వర్గానికి చెందిన ఓటర్లు 20 వేల మందికిపైగా ఉన్నారు. ప్రధాన పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపు, ఓటములపై ఈ సామాజికవర్గం ఓటర్ల ప్రభావం ఉంటుంది. కొంతకాలంగా యాదవ సామాజిక వర్గంలోని వైసీపీ నాయకులు రొండి కృష్ణయాదవ్, నాలి మాధవ తదితరులను ఎమ్మెల్యే పేర్ని నాని దూరం పెడుతూ వచ్చారు. దీంతో వీరు ఎంపీ వల్లభనేని బాలశౌరి, పెనమ లూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అనుచరులుగా ఉంటూ వైసీపీలోనే కొనసాగుతూ వచ్చారు. దీంతో రొండి కృష్ణయాదవ్‌పై స్థలం విషయంలో వేరే వ్యక్తులతో స్థానిక ఎమ్మెల్యే పోలీసులపై ఒత్తిడి తెచ్చి కేసు పెట్టించారు. ఎంపీ అనుచరుడిగా ఉంటున్నాడని అసూయతో నాలి మాధవను వివిధ రూపాల్లో వేధించారు. దీంతో యాదవ సామాజికవర్గానికి చెందిన పెద్దలంతా ఇటీవల కాలంలో సమావేశం ఏర్పాటు చేసుకుని వైసీపీని వీడాలని నిర్ణయించుకున్నారు. విషయం తెలిసి యాదవ సామాజికవర్గంలోని పెద్దలతో పార్టీ మారవద్దని ఎమ్మెల్యే పేర్ని నాని రాజీయత్నం చేసినా వారు పార్టీ మారితీరుతామని చెప్పేశారు. నాలి మాధవ ఇటీవల వైసీపీకి రాజీనామా కూడా చేశారు. నియోజకవర్గం యాదవ సామాజిక వర్గంలోని పెద్దలంతా వైసీపీని వీడి సోమవారం టీడీపీలో చేరారు. చంద్రబాబును కలిసినవారిలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు, మాజీ మంత్రి, మచిలీపట్నం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కొల్లు రవీంద్ర, గన్నవరం నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు, బచ్చుల బోసుబాబు ఉన్నారు.



మంగళగిరికి బీసీ నేతల కార్ల ర్యాలీ

టీడీపీలోకి పార్థసారథి

బొప్పన భవకుమార్, తుమ్మల చంద్రశేఖర్ కూడా

» 2న సైకిలెక్కనున్న వసంత కృష్ణప్రసాద్

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : పెనమలూరు వైసీపీ ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి, విజయవాడ నగర వైసీపీ అధ్యక్షుడిగా పనిచేసిన బొప్పన భవకుమార్, కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ తుమ్మల చంద్రశేఖర్ సోమవారం టీడీపీలో చేరారు. టీడీపీ యువనేత నారా లోకేశ్ సమక్షంలో వీరు పార్టీ కండువా కప్పుకొన్నారు. విజయవాడ నగరం ఎన్టీఆర్ సర్కిల్ నుంచి భారీఎత్తున ర్యాలీగా బయలుదేరి వెళ్లిన నాయకులు ఉండవల్లి చంద్రబాబు నివాసానికి చేరుకున్నారు. పార్థసారథితోపాటు జిల్లాకు చెందిన కొల్లు రవీంద్ర, బోడె ప్రసాద్, కేశినేని చిన్ని తదితర నేతలు తరలి వచ్చారు. మరోవైపు మైలవరం వైసీపీ ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ మార్చి 2న టీడీపీ చేరనున్నారు. దేవినేని ఉమతో తనకు వ్యక్తిగతంగా విభేదాలు లేవని ఆయనతో కలిసి నడిచేందుకు తనకు ఎలాంటి అభ్యంతరాలు లేవన్నారు.

ఓటు బ్యాంకుకు బ్రేక్ పడినట్టే..

యాదవ సామాజిక వర్గం నాయకులు మచిలీపట్నంలో అధికశాతం ఇప్పటివరకు వైసీపీకి అనుకూలంగానే ఉన్నారు. 2019లో, అంతకుముందు జరిగిన ఎన్నికల్లో పేర్ని నాని గెలుపుకోసం పనిచేశారు. ఆయన మంత్రి పదవి చేపట్టాక యాదవ సామాజికవర్గం నాయకులు, కార్యకర్తలను అంతగా పట్టించుకోలేదు. వీరి మాటకు విలువ ఇవ్వకపోవడంతో ఈ సామాజికవర్గం నాయకులు ఎంపీ బాలశౌరి పక్షాన చేరి ఆయనకు దగ్గరయ్యారు. ఇటీవల ఎంపీ బాలశౌరిని తమ ప్రాంతానికి భారీ ఊరేగింపుతో తీసుకువెళ్లి సన్మానించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రొండి కృష్ణ నివాసంలో గతంలో పేర్ని నాని ఎక్కువ సమయం కేటాయించి పార్టీ గెలుపుకోసం వ్యూహరచన చేసేవారు. అంతటి స్నేహం ఉన్నప్పటికీ ఎంపీ బాలశౌరికి అనుకూలంగా ఉంటున్నాడనే కారణంతో రొండి కృష్ణపై కేసు పెట్టించారు. ఎంపీ బాలశౌరి వైసీపీని వీడి జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థిగా మచిలీపట్నం పార్లమెంటు స్థానం నుంచి పోటీ చేస్తుండటంతో మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గంలోని బీసీ సామాజికవర్గంలోని యాదవుల ఓటుబ్యాంకు టీడీపీ వైపు మరలుతుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.



అవనిగడ్డ వైసీపీలో అయోమయం

నియోజకవర్గం వైపు తొంగిచూడని సమన్వయకర్త

» అభ్యర్థి ఎవరో తెలియక శ్రేణుల్లో నిస్తేజం

» కొత్త నేత కోసం అధిష్ఠానం వెతుకులాటలో ఉన్నట్టు ప్రచారం

అవనిగడ్డ, ఫిబ్రవరి 26 : అవనిగడ్డ నియోజకవర్గానికి సమన్వయకర్తగా డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్‌ను నియమిస్తూ వైసీపీ అధిష్టానం నిర్ణయం తీసుకుని నెలరోజులు దాటుతున్నా ఆయన నియోజకవర్గం వైపు కన్నెత్తి చూడకపోవటంతో వైసీపీ శ్రేణుల్లో అయోమయం నెలకొంది. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబును మచిలీపట్నం పార్లమెంట్ నుంచి పోటీ చేయించాలని ఆలోచనతో వైసీపీ అధిష్టానం పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించింది. అవనిగడ్డ నుంచి దివంగత మాజీ మంత్రి సింహాద్రి సత్యనారాయణరావు కుమారుడు, క్యాన్సర్ వైద్యనిపుణుడు డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్‌రావును నియమిస్తూ గతనెలలో నిర్ణయం తీసుకుంది. అనంతరం వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డిని కలిసిన డాక్టర్ చంద్రశేఖర్‌రావు తాను ఈ వయస్సులో పోటీ చేయలేనని, తనకు బదులుగా తన కుమారుడు, న్యాయవాది సింహాద్రి రామ్ చరణ్‌ను సమన్వయకర్తగా నియమించాలని కోరారు. దీనికి జగన్మోహన్‌రెడ్డి సూత్రప్రాయంగా అంగీకరించటంతో చంద్రశేఖర్ తన బదులు తన కుమారుడు రామ్ చరణ్ వైసీపీ సమన్వయకర్తగా ఉంటారని, ఆయనను కూడా ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. కొద్ది రోజుల్లోనే అవనిగడ్డ నియోజకవర్గం నుంచి రాజకీయ కార్యకలాపాలు ప్రారంభిస్తామని చెప్పిన చంద్రశేఖర్ మళ్లీ అవనిగడ్డవైపు చూడకపోవటంతో ఏం జరిగిందో అర్థం కాక కార్యకర్తలు అయోమయంలో ఉన్నారు.

స్థానిక నాయకత్వం తీరుతో వెనక్కి తగ్గారా?

స్థానిక నేతలను కలిశాక పార్టీ కార్యకలాపాలు సాగించాలనే భావనతో జనవరి చివరి వారంలో చంద్రశేఖర్ అవనిగడ్డకు వచ్చారు. స్థానిక నేతలు ఎవరూ కనీసం ఫోన్‌కు కూడా స్పందించలేదు. దీంతో సహాయ నిరాకరణ చేస్తున్నారన్న ఆవేదనతో డాక్టర్ చంద్రశేఖర్ తన కుమారుడిని అవనిగడ్డలో నుంచి బరిలోకి దింపాలన్న ఆలోచనను విరమించుకున్నారని ప్రచార జోరందుకుంది.

ఎమ్మెల్యే అభ్యర్థి ఎవరు?

అవనిగడ్డ సమన్వయకర్తగా నియమితులైన డాక్టర్ చంద్రశేఖర్ వెనక్కి తగ్గటంతో అవనిగడ్డ నియోజకవర్గం నుంచి వైసీపీ తరపున ఎవరు ఎమ్మెల్యే అభ్యర్థి అవుతారన్న విషయమై స్పష్టత లేక కార్యకర్తలు గందరగోళానికి గురవుతున్నారు. అవనిగడ్డ ఎమ్మెల్యేగా ఉన్న సింహాద్రి రమేష్‌బాబే మళ్లీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తారని ద్వితీయ శ్రేణి నేతలు ప్రచారం సాగిస్తున్నారు. దీనికితోడు 10 రోజుల క్రితం ఓ వివాహ కార్యక్రమానికి జగన్మోహన్‌రెడ్డిని ఆహ్వానించేందుకు వెళ్లిన సింహాద్రి రమేష్‌బాబును మళ్లీ ఎమ్మెల్యేగా పోటీ చేయమని జగన్మోహన్‌రెడ్డి సూచించినట్టు కూడా పెద్దఎత్తున ప్రచారం జరుగుతోంది. అయితే ఈ సీటును తమకు కేటాయించాలంటూ బీసీ సామాజికవర్గానికి చెందిన కొందరు నేతలు కూడా చాపకింద నీరులా ప్రయత్నాలు సాగిస్తున్నట్టు తెలుస్తోంది.

కొత్త నేత కోసం వెతుకులాట?

నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోనూ మంచి పట్టున్న డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్ సమన్వయకర్తగా నియమితులైన తర్వాత ఒక్కసారి కూడా నియోజకవర్గంలోని క్యాడర్‌ను కలవకపోవటంతో వైసీపీ అధిష్టానం మరో కొత్త వ్యక్తిని రంగంలోకి దింపాలన్న భావనలో ఉన్నట్టు కూడా నియోజకవర్గంలో చర్చ ఊపందుకుంది. వైసీపీలోని ద్వితీయ శ్రేణి నేతలను గానీ, కొత్త నేతలను గానీ రంగంలోకి దింపితే వారిపై వ్యతిరేకత రాకుండా ఉంటుందన్న ఆలోచనతో పార్టీ అధిష్టానం అన్వేషణ ప్రారంభించినట్టు తెలుస్తోంది.

పిలిచి నిర్బంధం

మంత్రి జోగి సభ నుంచి టీడీపీ కౌన్సిలర్లను ఈడ్చుకెళ్లిన పోలీసులు

- సమావేశం ముగిసేవరకూ స్టేషన్‌లో నిర్బంధం

- 6లో..

మండలికి టిక్కెట్ కేటాయించాలి

- నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం

- 6లో..

ఆలయ కమిటీ సమావేశంలో ఘర్షణ

- ఇద్దరికి తీవ్ర గాయాలు

- 6లో..

భలే.. కొలుసుకున్నారు!

ఒకే కారులో పక్కపక్కనే బోడె ప్రసాద్, పార్థసారథి



వారిద్దరూ నిన్నటిదాకా ప్రత్యర్థులు. పెనమలూరులో ఒకరిపై ఒకరు మాటల తూటాలు పేల్చుకున్నారు. ఎన్నికల్లో కలబడ్డారు. రాజకీయాల్లో శాశ్వత శత్రువులు.. శాశ్వత మిత్రులు ఉండరన్న నానుడిలా ఆ ఇద్దరూ కలిశారు. కొలుసు పార్థసారథి మంగళగిరిలో లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరేందుకు వెళుతుండగా బోడె ప్రసాద్, కొలుసు పార్థసారథి ఒకే కారులో ప్రత్యక్షమవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బోడె స్వయంగా కారు డ్రైవ్ చేస్తుండగా పార్థసారథి ఆయన పక్కనే ఆశీనులయ్యారు.

గన్నవరంలో గరళంపై ఆర్‌డబ్ల్యూఎస్ సీరియస్

కోనాయి చెరువు రిజర్వాయర్‌ను పరిశీలించిన డీఈ

» గండిని తక్షణం పూడ్చాలని ఆదేశాలు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/గన్నవరం) : రక్షిత మంచినీటి కోనాయి చెరువు రిజర్వాయర్‌కు గండికొట్టి.. తొండంగట్టు చెరువు నుంచి కాలుష్య నీటిని పంపింగ్ చేస్తున్న గన్నవరం గ్రామ పంచాయతీ అధికారులపై గ్రామీణ నీటిసరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'గన్నవరంలో గరళం' శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం రావటంతో మండల ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కదిలారు. పంచాయతీ సెక్రటరీ అనీల్ కుమార్ ఆదేశాలతో గండికొట్టిన కోనాయి చెరువును ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సుధాకర్ పరిశీలించారు. కోనాయి చెరువుతో పాటు కలుషిత కాసారంగా ఉన్న తొండంగట్టు చెరువును కూడా పరిశీలించారు. గండిని వెంటనే పూడ్చాలని ఆదేశించారు. పైలెట్ ప్రాజెక్టు పంప్‌హౌస్ నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. క్లోరిన్ గ్యాస్ అయిపోయిందని, దానికి బదులు బ్లీచింగ్ వాడుతున్నారని డీఈ గుర్తించారు. క్లోరిన్ గ్యాస్‌ను తెప్పించాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. తొండంగట్టు నుంచి వచ్చే నీటిని అడ్డుకుని, గండి పూడ్చాలని ఆదేశించారు. పంప్‌హౌస్‌లో వైర్లు చిందరవందరగా ఉన్నాయని, వాటిని సరిచేయించాలని కార్యదర్శి అనీల్ కుమార్‌కు చెప్పారు. రిపేరులో ఉన్న మోటార్లకు కూడా తక్షణం మరమ్మతులు చేయించాలని ఆదేశించినట్లు 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు.

బందరు, గుడివాడ రైల్వేస్టేషన్లకు ఆధునిక శోభ

గుడివాడ రైల్వేస్టేషన్ రీ డెవలప్‌మెంట్ నమూనా చిత్రం



- ఉమ్మడి కృష్ణాజిల్లాలో నాలుగు స్టేషన్ల రీ డెవలప్‌మెంట్
- రూ.100 కోట్ల వ్యయంతో అభివృద్ధికి శ్రీకారం
- అభివృద్ధి పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ

రాయనపాడు, గుణదల శాటిలైట్ స్టేషన్లకు కూడా..

ఉమ్మడి కృష్ణాజిల్లాలోని మచిలీపట్నం, గుడివాడ, రాయనపాడు, గుణదల రైల్వేస్టేషన్లు కొత్త శోభను సంతరించుకోనున్నాయి. ఈ రైల్వేస్టేషన్లు రీ డెవలప్‌మెంట్‌కు ఎంపికయ్యాయి. ఇప్పటికే రాయనపాడు స్టేషన్‌ను శాటిలైట్‌స్టేషన్‌గా ఎంపిక చేశారు. ఇదే వరుసలో గుణదల స్టేషన్‌ను కూడా శాటిలైట్‌గా ప్రకటించారు. ఈ రెండు శాటిలైట్ స్టేషన్లు కూడా రీ డెవలప్‌మెంట్ జాబితాలోకి వచ్చి చేరాయి. సోమవారం ప్రధాని మోదీ దేశవ్యాప్తంగా ప్రారంభించిన రీ డెవలప్‌మెంట్ స్టేషన్లలో ఈ రెండు శాటిలైట్ స్టేషన్లు ఉన్నాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రాయనపాడు, గుణదల రైల్వేస్టేషన్లను రీ డెవలప్‌మెంట్‌లో భాగంగా అత్యున్నతంగా ఆధునీకరించబోతున్నారు. వీటికి సంబంధించిన డిజైన్లను రైల్వే అధికారులు సోమవారం విడుదల చేశారు. రాయనపాడు శాటిలైట్ స్టేషన్‌ను రూ.12.13 కోట్ల వ్యయంతో రీ డెవలప్‌మెంట్‌కు శ్రీకారం చుట్టారు. ప్లాట్‌ఫామ్‌లకు అనుసంధానంగా ఈ స్టేషన్‌ను అభివృద్ధి చేయనున్నారు. అదనపు ప్లాట్‌ఫామ్‌లు కూడా కల్పిస్తారు. ప్రస్తుతం ఉన్న ప్లాట్‌ఫామ్‌ల ఉపరితలాలను ఆధునికంగా తీర్చిదిద్దనున్నారు. స్త్రీ, పురుషులతో పాటు దివ్యాంగులను కూడా దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ప్రీమియం మాడ్యులర్ టాయ్‌లెట్స్‌ను నిర్మించనున్నారు. అత్యాధునికమైన వెయిటింగ్ హాల్స్‌ను ఏర్పాటు చేయటంతో పాటు, సర్క్యులేటింగ్ ఏరియాను విస్తరించటం, కొత్తగా రెండు లిఫ్టులు ఏర్పాటు చేయటం, స్టేషన్‌లో మిరుమిట్లు గొలిపే లైటింగ్ ఏర్పాటు చేయటం వంటి వాటితోపాటు స్టేషన్ పరిసరాలు అందంగా, ఆధునికంగా కనిపించేలా అనేక ఏర్పాట్లు చేయనున్నారు.



బందరు రైల్వేస్టేషన్ రీ డెవలప్‌మెంట్ నమూనా

- **గుణదల స్టేషన్‌కు రూ.24.37 కోట్లు**

నగరంలో రెండో శాటిలైట్ స్టేషన్ అయిన గుణదల స్టేషన్ విషయానికి వస్తే రూ.24.37 కోట్ల వ్యయంతో రీ డెవలప్‌మెంట్ చేయనున్నారు. దీనికి సంబంధించిన డిజైన్‌కు కూడా రైల్వే అధికారులు విడుదల చేశారు. ఈ డిజైన్ విజయవాడలోని అంబేడ్కర్ స్మృతివనం తరహాలో ఉంటుంది. పూర్తిగా గ్లాస్ స్ట్రక్చర్ ఎక్కువగా కనిపిస్తుంది. రైల్వే స్టేషన్ ఆధునీకరణలో భాగంగా అదనపు ప్లాట్‌ఫామ్‌లను ఏర్పాటు చేస్తారు. ప్లాట్‌ఫామ్‌లను ఆధునికంగా తీర్చిదిద్దుతారు. రాయనపాడు శాటిలైట్‌స్టేషన్ తరహాలోనే టాయ్‌లెట్లు, వెయిటింగ్ హాల్స్, సర్క్యులేటింగ్ ఏరియా, రెండు లిఫ్టులు వేస్తారు. వీటితో పాటు 12 మీటర్ల ఫుట్ ఓవర్ బ్రిడ్జి (ఎఫ్‌ఓబీ)ని కూడా విడుదల చేస్తారు. స్టేషన్ లైటింగ్‌ను ఆధునీకరిస్తారు.


- **మచిలీపట్నం, గుడివాడ స్టేషన్లు అదరహో**

జిల్లా కేంద్రం మచిలీపట్నం స్టేషన్, గుడివాడ రైల్వేస్టేషన్లను కళ్లు మిరుమిట్లుగొలిపేలా రైల్వే శాఖ రీ డెవలప్‌మెంట్‌లో భాగంగా అభివృద్ధి చేయబోతోంది. మచిలీపట్నం రైల్వేస్టేషన్‌ను సచివాలయ బ్లాక్ తరహాలో నిర్మించేలా డిజైన్‌ను సిద్ధం చేశారు. దీనిని రూ.27.37 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేయనున్నారు. నూతన స్టేషన్ నిర్మాణంతో పాటు అదనపు ప్లాట్‌ఫామ్‌లు, టాయ్‌లెట్స్, వెయిటింగ్ హాల్స్, ఫుట్ ఓవర్ బ్రిడ్జి (ఎఫ్‌ఓబీ), రెండు లిఫ్టులు, ల్యాండ్ స్కేపింగ్, మెరుగైన లైటింగ్, సర్క్యులేటింగ్ ఏరియా డెవలప్‌మెంట్ వంటివి చేపట్టనున్నారు. ఇక గుడివాడ రైల్వేస్టేషన్ విషయానికి వస్తే చైనా వాల్ తరహాలో స్టేషన్ భవనాన్ని డిజైన్ చేశారు. గుడివాడ స్టేషన్ రీ డెవలప్‌మెంట్ కోసం రైల్వే శాఖ రూ.27.37 కోట్లు ఖర్చు చేయనుంది. గుడివాడ రైల్వేస్టేషన్‌లో భాగంగా అదనపు ప్లాట్‌ఫామ్‌లు, మూడు ఎక్స్‌కవేటర్లు, ఒక ఎఫ్‌ఓబీ, స్టేషన్ లైటింగ్ వంటి పనులు చేపట్టనున్నారు.

నాసిరకం మద్యం పోవాలన్నా.. మహిళల మాంగల్యం నిలవాలన్నా..

జగన్ పోవాలి.. చంద్రబాబు రావాలి

▸ పార్టీ శ్రేణులు, ప్రజలకు నెట్టెం రఘురాం పిలుపు



విద్యాధరపురం, ఫిబ్రవరి 26 : నాసిరకం మద్యం పోవాలంటే.. మహిళల మాంగల్యాలు నిలవాలంటే జగన్ పోవాలి, చంద్రబాబు రావాలని.. ఇందుకోసం ప్రతి టీడీపీ కార్యకర్త ఎన్నికల్లో అలుపెరగకుండా శ్రమించాలని ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. జగన్‌రెడ్డి పాలనలో మద్యం రేట్లను మూడు రెట్లు పెంచి నాసిరకం మద్యంతో లక్ష కోట్ల ఆదాయం తాడేపల్లి ప్యాలె‌స్‌కు మళ్లించాడని ఆరోపించారు. ఈ మద్యం తాగిన 35 లక్షల మంది ఆరోగ్యాలు పాడైపోయాయన్నారు. 30వేల మంది ప్రాణాలు కోల్పోగా వారి కుటుంబాలు వీధిన పడ్డాయన్నారు. మద్యం, గంజాయి, డ్రగ్స్ బారిన పడి యువత నిర్వీర్యమవుతున్నదన్నారు. అత్యాచారాలు, నేరాలు పెరిగి పోయాయన్నారు. రాష్ట్రంలో నాలుగు లక్షల బెల్టుషాపులు, మొబైల్ షాపులతో మద్యం అక్రమ వ్యాపారం మొత్తం జగన్‌రెడ్డి, విజయసాయిరెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిల కనుసన్నల్లోనే జరుగుతున్నదన్నారు. నాసిరకం మద్యం పోవాలన్నా.. మహిళల మాంగల్యాలు నిలవాలన్నా.. జగన్ పోవాలి.. చంద్రబాబు రావాలని, ఇందుకోసం కార్యకర్తలు అలుపెరగకుండా శ్రమించాలని పిలుపునిచ్చారు.

మద్య నిషేధ వాగ్దానం అటకెక్కించిన వైసీపీ : కొలికపూడి



తిరువూరు: సంపూర్ణ మద్యనిషేధం చేస్తానని గత ఎన్నికల్లో వాగ్దానం చేసిన జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం విక్రయాలను ఒక ఉద్యమంలా చెపట్టాడని టీడీపీ తిరువూరు నియోజకవర్గ అభ్యర్థి కొలికపూడి శ్రీనివాసరావు విమర్శించారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశంలో ఏరాష్ట్రంలో లేని విధంగా మూడురెట్లు ధరలు పెంచి మద్యంపై వచ్చే ఆదాయం తాకట్టు పెట్టి సుమారు రూ.40 వేల కోట్లు అప్పుతెచ్చాడని ఆరోపించారు. రాబోయే 25 సంవత్సరాల్లో రాష్ట్ర ప్రభుత్వం మద్యం ద్వారా వచ్చే ఆదాయంతోనే అప్పులు తీర్చాల్సిన పరిస్థితి ఏర్పాడుతోందన్నారు. దేశవ్యాప్తంగా ఆన్‌లైన్ చెల్లింపులు ఉంటే మద్యం షాపుల్లో నగదు మాత్రమే అనుమతించడం ద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టి వందల కోట్లు తాడేపల్లి ప్యాలె‌స్‌కు తరలిస్తున్నారన్నారు. జగన్‌తో పాటు మంత్రులు రోజా, విడుదల రజనిలు మళ్లీ మద్యం నిషేదం తరువాతే ఓట్లు అడుగుతామని చెప్పి ఏముఖంతో ప్రజల ముందుకు వస్తారని ప్రశ్నించారు. మద్యం విధానంపై బహిరంగ చర్చకు రావాలని ప్రభుత్వానికి సవాల్ విసిరారు. టీడీపీ, జనసేన నాయకులు జయసింహా, మినుగు శ్రీనివాసరావు ఉయ్యూరు జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ యూత్ అధ్యక్షుడు

గంపలగూడెం : తిరువూరు నియోజకవర్గ వైసీపీ యూత్ అధ్యక్షుడు ఎంవీ కృష్ణ సోమవారం కొణిజర్లలో జరిగిన టీడీపీ సమావేశంలో ఎమ్మెల్యే అభ్యర్థి కొలికపూడి శ్రీనివాసరావు సమక్షంలో పార్టీలో చేరారు. ఆయనతో పాటు కొణిజర్ల వైసీపీ గ్రామశాఖ అధ్యక్షుడు గుంటుపల్లి విశ్వేశ్వరరావు, పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ నంబూరి శ్రీనివాసరావు, నంబూరి నరేష్, జర్రిపోతుల నాగరాజులు టీడీపీలో చేశారు.



కౌన్సిలర్ నకిరికంటి వెంకట్‌ను పరామర్శిస్తున్న దళిత నేతలు

దళితులపై కవ్వింపులా!

▸ ఉదయభాను హుందాగా వ్యవహరించాలి

▸ టీడీపీ దళిత నేతల హితవు

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 26 : పార్టీ నేర్పిన సంస్కారం, నియోజకవర్గ నేతల సంయమనం వల్లనే ఆదివారం ఎంత రెచ్చగొట్టినా వైసీపీ నేతలు, కార్యకర్తలు బతికిపోయారని జగ్గయ్యపేట నియోజకవర్గ టీడీపీ ఎస్సీ సెల్ నేతలు హితవు పలికారు. ఐదు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉంటున్నానని చెప్పుకునే ఎమ్మెల్యే టీడీపీ ర్యాలీకి కారు అడ్డుపెట్టడం సమంజసమా..! కార్యకర్తలు పార్టీ జెండాతో అటంకాలు సృష్టిస్తుంటే నియంత్రించలేరా.. అని ప్రశ్నించారు. సోమవారం వార్డు కౌన్సిలర్ నకిరికంటి వెంకట్ ఇంటి వద్ద రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రతినిధులు సమావేశమై ఆదివారం జరిగిన ఘటనపై మాట్లాడారు. ర్యాలీకి అడ్డుగా కారు పెట్టారని, పార్టీ కార్యకర్తలు జెండాలతో దాడికి వస్తుంటే కనీసం నియంత్రించే హుందాతనం ఎమ్మెల్యేకు లేకపోవటం దౌర్భాగ్యమన్నారు. అకారణంగా బూదవాడకు చెందిన కార్యకర్త గుగ్లోతు రాంబాబు తల పగలగొట్టడం, అడ్డుకున్న కౌన్సిలర్ వెంకట్‌పై కర్రలతో దాడి చేయటం, ర్యాలీలోకి రావటం తప్పు కాదా అని ప్రశ్నించారు. తమ పార్టీ సంస్కారాన్ని, ఓర్పును అసమర్థంగా భావిస్తే మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. దళితులంతా వైసీపీ ప్రభుత్వ మోసాలపై ఆగ్రహంతో టీడీపీ ర్యాలీకి వస్తే తట్టుకోలేకనే అటంకాలు సృష్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే పునరావృతమైతే గట్టిగా బుద్ధి చెబుతామని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన టీడీపీ అభ్యర్థి శ్రీరాం తాతయ్యను భారీ మెజారిటీతో గెలిపిస్తామని చెప్పారు. దళితనేతలు అన్నెపాగ దుర్గామహేశ్వరరావు, ఇనపనూర్తి రాజు, కర్ల జోజి, నటుకుల రవి, యండ్రాతి వెంకటేశ్వర్లు, దేవరకొండ ఆనంద్, మార్కపుడి వంశీ, అదిమళ్ల రమేష్, గడ్డిపర్తి ప్రసాద్, వేముల రాజు, మల్లెల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

దాడిచేసిన వారిని గుర్తించి బైండోవర్ చేస్తాం : సీఐ జానకిరాం

తెలుగుదేశం పార్టీ దళితుల ర్యాలీపై వైసీపీ మూకదాడి ఘటనపై ఎలాంటి ఫిర్యాదులు అందలేదని జగ్గయ్యపేట సీఐ జానకీరాం చెప్పారు. ఆయన సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ, సంఘటనపై ఇరు పార్టీల నుంచి ఫిర్యాదులు రాలేదని, భవిష్యత్‌లో శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా వీడియో దృశ్యాలను పరిశీలించి దాడులకు పాల్పడిన వారిని గుర్తించి సుమోటోగా బైండోవర్ చేస్తామని చెప్పారు. పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పలువురు ప్రముఖులను కలిసిన వసంత



డాక్టర్ హనిమిరెడ్డి నివాసం వద్ద మైలవరం ఎమ్మెల్యే వసంత

మైలవరం, ఫిబ్రవరి 26 : త్వరలో టీడీపీలో చేరనున్న మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ సోమవారం మైలవరం జమిందార్ ఎస్వీ సుధాకరరావును, ఎన్నారై డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా తన ఆలోచనలను వారితో పంచుకోగా వారు సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. వసంత మైలవరం వచ్చారని తెలుసుకున్న పలు పార్టీల నాయకులు ఆయన్ని కలిసి అభినందనలు తెలిపారు. త్వరలో టీడీపీలో చేరుతున్నానని, అధిష్టానం నిర్ణయం మేరకు తన పోటీ ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. మైలవరం ముఖ్య నాయకులను కలుస్తున్నట్లు అయన చెప్పారు.

ఇళ్ల పట్టాలపై చర్చకు సిద్ధమా

▸ వైసీపీ నాయకులకు టీడీపీ నేతల సవాల్



విలేకర్ల సమావేశంలో ఇళ్ల పట్టాలు చూపుతున్న టీడీపీ నేతలు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 26 : ఎమ్మెల్యే పేర్ని నాని తన అనుయాయులకు ఇచ్చిన ఇళ్ల స్థలాల పట్టాలు దొంగ పట్టాలని నిరూపించేందుకు బహిరంగ చర్చకు కోనేరుసెంటర్‌లో సిద్ధంగా ఉన్నామని టీడీపీ నాయకులు దిలీప్, సయ్యద్ ఖాజా సవాల్ విసిరారు. సోమవారం మచిలీపట్నం టీడీపీ అసెంబ్లీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో దిలీప్ మాట్లాడారు. చిలకలపూడి ఎన్టీఆర్ నగర్, నేషనల్ కళాశాల వద్ద, నాగులేరుకు గోసాల మధ్య ఉన్న భూములకు స్ట్రీట్ ఫీల్డ్‌లో ఇచ్చిన పట్టాలు దొంగ పట్టాలు కావా అని ప్రశ్నించారు. పట్టాలపై ఎక్కడా తహసీల్దార్ రాజముద్ర లేదన్నారు. చిలకలపూడిలో పేదల ఇళ్లను రాత్రికి రాత్రికి తొలగించిన వైసీపీ నాయకుల నిజస్వరూపం అందరికీ తెలుసన్నారు. ప్రజలు తమ పట్టాలు తహసీల్దార్ కార్యాలయం రిజిస్టర్‌లో ఉన్నాయో లేవో సరి చూసుకోవాలన్నారు. అక్కడ ఇళ్లు వేసుకుంటే నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఎన్నికల ముందు వైసీపీ నాయకులు దొంగ పట్టాలు ఇస్తున్నారన్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా స్ట్రీట్ ఫీల్డ్‌లో చిలకలపూడి హైస్కూల్ భవన నిర్మాణంపై కోర్టు అక్షింతలు వేసిన సంగతిని దిలీప్ గుర్తుచేశారు. సయ్యద్‌ఖాజా మాట్లాడుతూ, మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వ నిధులు వ్యయం చేయకుండా వైసీపీ పాలకులు అడ్డు పడుతున్నారన్నారు. అజీం తదితరులు పాల్గొన్నారు.



రైతు, కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ ప్రారంభిస్తున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు



చల్లపల్లి ప్రధాన సెంటర్లో ప్రసంగిస్తున్న రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ

రైతులపై మారణకాండ ఆపాలి

▸ దేశానికి నష్టం చేసే ఒప్పందాల నుంచి ప్రభుత్వం వైదొలగాలి : వడ్డే

▸ డబ్ల్యూటీవో ఒప్పందానికి వ్యతిరేకంగా రైతు, కార్మిక సంఘాల ర్యాలీ

గవర్నర్‌పేట, ఫిబ్రవరి 26 : ప్రపంచ వాణిజ్య సంస్థతో దేశానికి నష్టం చేసే ఒప్పందాలను మోదీ ప్రభుత్వం అంగీరించొద్దని రైతు సంఘాల నేతలు డిమాండ్ చేశారు. రైతు, కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం పాత బస్టాండ్ సెంటర్ నుంచి ఏలూరు రోడ్డు మీదుగా లెనిన్ సెంటర్ వరకు బైక్ ర్యాలీ జరిగింది. ర్యాలీని రాష్ట్ర మాజీ వ్యవసాయ శాఖామంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు జెండా ఊపి ప్రారంబించారు. అనంతరం లెనిన్‌సెంటర్‌లో జరిగిన సభలో వడ్డే మాట్లాడుతూ, ప్రపంచ వాణిజ్యసంస్థతో కేంద్రం చేసుకునే ఒప్పందాలు ప్రజానీకానికి, రైతులకు, కార్మికులకు నష్టం చేస్తాయని హెచ్చరించారు. డబ్ల్యూటీవోతో చేసుకునే ఒప్పందాల కారణంగా వ్యవసాయ రంగానికి, పరిశ్రమలకు నష్టం కలగుజేస్తుందన్నారు. గతంలో గాట్ ఒప్పందం దుష్ప్రభావాలను దేశ ప్రజలు చవిచూశారని పేర్కొన్నారు. బహుళజాతి సంస్థలు, స్వదేశీ కార్పొరేట్లకు మేలు చేసే అంశాలు ఈ ఒప్పందంలో ఉన్నాయని తెలిపారు. ఈ ఒప్పందం వల్ల దేశీయ ఉత్పత్తులు దెబ్బతినడం, స్వదేశీ పరిశ్రమలు మూతపడే ప్రమాదముందన్నారు. రైతు సంఘం నాయకులు వై.కేశవరావు మాట్లాడుతూ, ప్రపంచంలో అనేక దేశాలు ఇటువంటి ఒప్పందాలను చేసుకుని నష్టపోవడం గురించి ప్రస్తావించారు. ఆయా దేశాలలో ఈ విధానాల పట్ల నిరసనలు వ్యక్తమౌతున్నాయన్నారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు దడాల సుబ్బారావు, హరినాథ్, కార్మిక సంఘాల నేతలు ఎస్ హెచ్ శ్రీనివాసరావు, ఎ.వెంకటేశ్వరరావు, ఎం.సాంబశివరావు, ఆంజనేయులు, కె.దుర్గారావు, ఈవీ నారాయణ, కె.రామకృష్ణ, కె.సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లిలో రైతుల ర్యాలీ

చల్లపల్లి : ఢిల్లీలో రైతులపై మోదీ ప్రభుత్వం మారణకాండను ఆపాలని జిల్లా రైతుసంఘం ఉపాధ్యక్షుడు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, కౌలురైతు సంఘం ప్రధాన కార్యదర్శి పంచకర్ల రంగారావులు అన్నారు. ఆలిండియా కిసాన్ సభ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం చల్లపల్లిలో రైతులు ట్రాక్టర్లు, బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన సెంటర్లో జరిగిన సభలో నేతలు మాట్లాడుతూ, మోదీ ఇచ్చిన హామీని అమలుచేయాలని కోరితే ఒక రైతును ప్రభుత్వం చంపేసిందన్నారు. టియర్ గ్యాస్ ప్రభావంతో రైతులకు కళ్లు, చెవులు దెబ్బతిన్నాయన్నారు. రైతులపై మారణకాండ సాగిస్తున్న మోదీకి ఒక్క క్షణం కూడా అధికారంలో ఉండే హక్కులేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రం నుంచి ప్రారంభమైన ర్యాలీ చల్లపల్లి పురవీధుల్లో సాగింది. కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శులు యద్దనపూడి మధు, వాకా రామచంద్రరావు, బండి ఆదిశేషు, సీఐటీయూ జిల్లా నేత శీలం నారాయణరావు, మండల కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా, సీపీఐ నేత మల్లుపెద్ది బోసు, రైతుసంఘం నేతలు వేమూరి రమేష్‌బాబు, మేడంకి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మీర్ రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.



పిలిచి నిర్బంధం

▸ మంత్రి జోగి సభ నుంచి టీడీపీ కౌన్సిలర్లను ఈడ్చుకెళ్లిన పోలీసులు

▸ సమావేశం ముగిసేవరకూ స్టేషన్‌లో నిర్బంధం



కౌన్సిలర్ పంద్రాజు సుధారాణిని ఈడ్చుకు వెళుతున్న పోలీసులు, టీడీపీ నేత జగరోతు నాగరాజును తీసుకు వెళుతున్న కంకిపాడు సీఐ శ్రీనివాస్

ఉయ్యూరు, ఫిబ్రవరి 26 : కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గంలోని ఉయ్యూరులో టిడ్కోఇళ్ల లబ్ధిదారుల సమీక్ష సమావేశం నుంచి టీడీపీ కౌన్సిలర్లు, పార్టీ నాయకులను పోలీసులు ఈడ్చుకువెళ్లి జీపుల్లో ఎక్కించి పోలీసు స్టేషన్‌కు తరలించారు. నగర పంచాయతీ పరిధిలో జెమినీస్కూల్ సమీపాన టిడ్కో ఇళ్ల వద్ద లబ్దిదారులతో సోమవారం గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేశ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కమిషనర్ ఆహ్వానం మేర నగర పంచాయతీకి చెందిన అధికార పార్టీ వారితో పాటు టీడీపీ కౌన్సిలర్లు పంద్రాజు సుధారాణి, పరిమి సలోమి సంతోషి, పలియాల శ్రీనివాసరావు, బూరెల రమణలు హాజరయ్యారు. వీరితోపాటు పలువురు టీడీపీ నాయకులు సమావేశానికి వెళ్లారు. సమావేశం ప్రారంభం కాక ముందే టీడీపీ కౌన్సిలర్లు, నాయకులపై పోలీసులు జులుంప్రదర్శించి వారిని సమావేశం నుంచి బయటకు ఈడ్చుకు వెళ్లి పోలీసు జీపులు, వాహనాల్లో ఎక్కించి పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కమిషనర్ ఆహ్వానం మేర వచ్చామని, ఏమితప్పు చేశామని మమల్ని బయటకు తీసుకువెళుతున్నారని టీడీపీ కౌన్సిలర్లు పోలీసులను ప్రశ్నించి ప్రతిఘటించినప్పటికి పట్టించుకోకుండా లాక్కువెళ్లి వాహనాలు ఎక్కించారు. సమావేశంలో అలజడి సృష్టిస్తారన్న నెపంతో కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు జంపాన గుర్నాధరావు, జంపాన పూర్ణచంద్రరావు, ఖుద్దూస్, కూనపరెడ్డి వాసు, చిరంజీవి, పరిమి భాస్కర్, జగరోతు నాగరాజు, నరేశ్, తదితరులను స్టేషన్‌కు తీసుకువెళ్లి సమావేశం ముగిసేవరకు నిర్బంధించారు.

మండలికి టిక్కెట్ కేటాయించాలి

▸ నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం



సమావేశంలో మాట్లాడుతున్న మోపిదేవి జడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లికార్జునరావు, ఆరు మండలాల నాయకులు, కార్యకర్తలు



మోపిదేవి, ఫిబ్రవరి 26 : అవనిగడ్డ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మండలి బుద్ధప్రసాద్‌కు టిక్కెట్ కేటాయించేలా టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పరిశీలన చేయాలని టీడీపీ నేతల విస్తృత స్థాయి సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం ఆమోదించారు. సోమవారం ఉదయం మోపిదేవిలోని డాక్టర్ మండవ సాయి ప్రాంగణంలో నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో భాగంగా ఆరు మండలాల అధ్యక్షులు, సీనియర్ నాయకులు మాట్లాడుతూ, రాష్ట్రంలో పార్టీ ఆవిర్భావం నుంచి తెలుగుదేశం పార్టీకి నియోజకవర్గంలోని ఆరు మండలాలు కంచుకోటగా నిలిచాయన్నారు. రెండేళ్ల క్రితం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ టీడీపీ అధిష్ఠానం పోటీకి దూరం అంటూ ప్రకటించినా నియోజకవర్గంలోని రెండు మండలాలు ఎంపీపీ, జడ్పీటీసీలు భారీ మెజార్టీతో విజయం సాధించాయన్నారు. అవినీతి మరకలు లేకుండా ప్రజామద్దతుతో పరిపాలన చేసిన మండలి బుద్ధప్రసాద్‌కు మొదటి జాబితాలో పేరు ప్రకటించకపోవటంతో ద్వితీయ శ్రేణి నేతలు తీవ్ర మనోవేదనకు గురి కావాల్సి వచ్చిందన్నారు. కాపు సామాజిక వర్గం ప్రాతిపదికన తీసుకున్నప్పటికీ జిల్లాలో అగ్రనేతగా మండలి బుద్ధ ప్రసాద్‌కు పేరుందన్నారు. తెలుగుదేశం-జనసేన పొత్తులో భాగంగా టీడీపీ సీటు వదులుకోవాల్సి వస్తే జనసేన తరఫున బుద్ధప్రసాద్‌కు టిక్కెట్ ఇచ్చే ఆలోచన చేసినా సంపూర్ణ మద్దతు తెలియజేస్తామంటూ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు ఏక వాక్య తీర్మానాన్ని చేసి ఆమోదించారు. నియోజకవర్గ కార్యకర్తల అభిప్రాయాన్ని అధినాయకత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. మోపిదేవి టీడీపీ అధ్యక్షుడు నడకుదుటి జనార్ధనరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో చల్లపల్లి, అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు, ఘంటసాల మండలాల అధ్యక్షులు మోర్ల రాంబాబు, యాసం చిట్టిబాబు, మెండు లక్ష్మణరావు, బండే శ్రీనివాసరావు, తుమ్మల చౌదరిబాబు, మోపిదేవి ఎంపీపీ రావి దుర్గావాణి, జడ్పీటీసీ సభ్యులు మెడబలిమి మల్లికార్జునరావు, పార్టీ సీనియర్ నాయకులు మండవ బాలవర్ధిరావు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, ప్రధాన కార్యదర్శి పైడిపాముల కృష్ణకుమారి, సీనియర్ నాయకులు రావి నాగేశ్వరరావు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.



మోపిదేవిలో స్టేషన్ భవనం ప్రారంభిస్తున్న డీఐజీ అశోక్‌కుమార్, ఎమ్మెల్యే రమేష్‌బాబు, ఎస్పీ అస్మీ

మోడల్ స్టేషన్‌తో మరింత మెరుగైన సేవలు

▸ ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్ కుమార్

మోపిదేవి, ఫిబ్రవరి 26 : మోడల్ పోలీస్ స్టేషన్ ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తామని ఏలూరు రేంజ్ డీఐజీ జీవీ అశోక్ కుమార్ తెలిపారు. రూ.1.50 కోట్లతో మోపిదేవిలో నూతనంగా నిర్మించిన మోడల్ పోలీస్ స్టేషన్ భవనాన్ని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుతో కలిసి డీఐజీ అశోక్ కుమార్, జిల్లా ఎస్పీ నయిమ్ అస్మీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రతీ సచివాలయానికి మహిళా సంరక్షణ కార్యదర్శిని ఏర్పాటు చేసి గ్రామాల్లో శాంతిభద్రతలు పరిరక్షిస్తున్నట్టు తెలిపారు. త్వరలో మోపిదేవి స్టేషన్‌కు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్ వెలువడేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జడ్పీ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారిక, అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్, అవనిగడ్డ, చల్లపల్లి సీఐలు త్రినాథ్, నాగప్రసాద్, సర్పంచ్ నందిగం మేరీ రాణి, ఎస్ఐలు సత్యనారాయణ, చిన్నబాబు, శిరీష, సుబ్రహ్మణ్యం, ప్రతాప్ రెడ్డి తదితరులు ఉన్నారు.

పార్టీ శ్రేణులు ధైర్యంగా ఉండాలి : ఉమా

▸ పుల్లారావు మృతి పార్టీకి తీరని లోటు



పుల్లారావు కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఉమా

మైలవరం, ఫిబ్రవరి 26 : చంద్రగూడెం టీడీపీ నేత పుల్లారావు మృతి పార్టీకి తీరని లోటని టీడీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. పార్టీ శ్రేణులు భావోద్వేగాలకు గురికావద్దన్నారు. బ్లూ మీడియా, సోషల్ మీడియాలో ఫేక్ ప్రచారాలను నమ్మవద్దన్నారు. మైలవరం సీటు దేవినేని ఉమామహేశ్వరరావుకు ఇవ్వడం లేదని, ఇతరులు పోటీ చేస్తారని సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలతో తీవ్ర మనస్తాపం చెందిన పుల్లారావు ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. సోమవారం దేవినేని ఉమా పార్టీశ్రేణులతో కలిసి పుల్లారావు పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అతడి కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. పుల్లారావు కుమారుడు అమెరికాలో ఉండటంతో కుటుంబసభ్యుల కోరిక మేరకు పుల్లారావు మృతదేహాన్ని మార్చురీలో ఉంచారు. మంగళవారం పుల్లారావు అంత్యక్రియల్లో నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఉమా పిలుపునిచ్చారు.

ఉమాకు సీటు లేదని.. కార్యకర్త మృతి

ఇబ్రహీంపట్నం : మైలవరం సీటు ఉమాకు ఇవ్వడం లేదని తీవ్ర మనస్తాపంతో కొండపల్లి మున్సిపాలిటీ 24వ డివిజన్ తూర్పు భీమరాజుగుట్ట నివాసి క్రియాశీలక కార్యకర్త నూతక్కి సురేష్ (40) ఆదివారం రాత్రి బ్రెయిన్ స్ట్రోక్‌తో కుప్పకూలిపోయాడు. కుటుంబసభ్యులు విజయవాడలోని ప్రయివేటు ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. భార్య, ఇద్దరు ఆడపిల్లలు, పిల్లాడు ఉన్నారు.

పల్స్‌పోలియో విజయవంతం చేయాలి

మచిలీపట్నం టౌన్ : దేశ వ్యాప్తంగా మార్చి 3వ తేదీన జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ అన్నారు. స్పందన హాలులో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జి.గీతాబాయితో కలిసి జేసీ మాట్లాడారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల పిల్లల వరకు పోలియో చుక్కలు వేయాలన్నారు. జిల్లాలో 1,39,180 మంది పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేయాల్సి ఉందన్నారు. జిల్లాలో 4 లక్షల 71 వేల 392 ఇళ్ల వద్దకు 2060 మంది వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, 949 మంది ఐసీడీఎస్ సిబ్బంది, 1381 మంది ఆశా వర్కర్లు, 58 మంది ఇతరులు సేవలందిస్తారన్నారు. విజయవంతం అయ్యేందుకు కృషి చేసి పోలియో వ్యాధిని పారదోలాలన్నారు.

28 నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాల మూసివేత

వన్‌టౌన్, ఫిబ్రవరి 26 : ఎన్టీఆర్ జిల్లాలో 2023-24 పంట కాలానికి సంబంధించి ధాన్యం కొనుగోళ్లు పూర్తయిన కేంద్రాలను ఈ నెల 28వ తేదీ నుంచి మూసివేయడం జరుగుతుందని, ఇంకా ఎవరైనా రైతులు తమ ధాన్యాన్ని విక్రయించాల్సి ఉంటే వెంటనే వారి పరిధిలోని కొనుగోలు కేంద్రంలో విక్రయించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఖరీఫ్ 2023-24 పంటకాలానికి సంబంధించి జిల్లాలో 2,74,627 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చిందని. ఇందులో ప్రభుత్వం 1,38,000 మెట్రిక్ టన్నుల కొనుగోళ్లను లక్ష్యంగా నిర్ణయించినట్టు తెలిపారు. ఇప్పటివరకు రూ.1,03,535,880 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్టు జేసీ ఆ ప్రకటనలో వెల్లడించారు.



అస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

ఆలయ కమిటీ సమావేశంలో ఘర్షణ

▸ ఇద్దరికి తీవ్ర గాయాలు

మోపిదేవి, ఫిబ్రవరి 26 : మండలంలోని పెదప్రోలులో గ్రామదేవత అద్దంకి నాంచారమ్మ అమ్మవారి ఆలయ కమిటీ సమావేశంలో ఘర్షణ జరిగి ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. త్వరలో జరగనున్న అమ్మవారి వార్షిక జాతర మహోత్సవంలో భాగంగా ఆదివారం రాత్రి దేవస్థానం ప్రాంగణంలో ఆలయ కమిటీ, గ్రామస్థులతో సమావేశం జరిగింది. సమావేశంలో భాగంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతుండగా, గ్రామస్థులకు కమిటీ సభ్యులకు మధ్య వాగ్వాదం నెలకొంది. అదికాస్తా తీవ్ర ఘర్షణకు దారితీసి యన్నం శ్రీనివాసరావు, యన్నం చంటిలపై గౌరం హర్షవర్ధన్, గౌరం శివప్రసాద్‌లు కుర్చీలతో దాడి చేశారు. శ్రీనివాసరావు, చంటిలకు తీవ్ర గాయాలు కావటంతో 108లో అవనిగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. ఘర్షణ నేపథ్యంలో కొద్ది రోజుల్లో జరిగే వార్షిక జాతర మహోత్సవంపై గ్రామంలో తీవ్ర ఆందోళన నెలకొంది.



ఐసీయూ విభాగాన్ని ప్రారంభిస్తున్న సద్గురు శ్రీమధుసూదన సాయి

సిలికానాంధ్ర సంజీవని వైద్యాలయంలో

ఉచితంగా ఐసీయూ సేవలు

▸ సద్గురు మధుసూదనసాయి

కూచిపూడి, ఫిబ్రవరి 26 : కృష్ణాజిల్లా కూచిపూడిలో రవి ప్రకాశ్ సిలికానాంధ్ర సంజీవని వైద్యాలయంలో స్త్రీల ప్రసూతి విభాగం, నియోనేటల్ (ఐసీయూ) సేవలు పూర్తి ఉచితంగా అందజేస్తారని సద్గురు మధుసూదనసాయి (బెంగళూరు) పేర్కొన్నారు. వైద్యాలయంలో సద్గురు శ్రీ మధుసూదనసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ రీసెర్చ్ సంస్థ సహకారంతో ఏర్పాటైన సాయిఆరోగ్య మల్టీ స్పెషాలిటీ హాస్పటల్స్‌లో ఐసీయూ విభాగాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, వైద్యం కోసం వచ్చిన రోగికి చిరునవ్వుతో పలకరించి కుశల ప్రశ్నలు వేస్తే కొంత రోగం నయమవుతుందన్నారు. ఆ తర్వాత వైద్యసేవలు చేస్తే పూర్తిగా కోలుకునే అవకాశాలు ఉంటాయని తెలిపారు. ప్రతీ ఒక్కరికి ఆరోగ్యం, అక్షరం, భోజనం ముఖ్యమని తెలిపారు. వైద్యాలయం చైర్మన్ డాక్టర్ కూచిభొట్ల ఆనంద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆసుపత్రి ఏవో జొన్నలగడ్డ హనుమకుమార్, వైద్యాలయ నిపుణులు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	159, 168, 179
చికెన్ విత్ స్కిన్	308
చికెన్ స్కిన్‌లెస్	316

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.75

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు



పట్టుబడ్డ వాహనాలతో సీఐ హబీబ్‌బాషా, ఎస్సై

ఉయ్యూరు, ఫిబ్రవరి 26 : బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న కంకిపాడుకు చెందిన రాఘవయ్యను సోమవారం అరెస్టు చేసి అతని వద్ద నుంచి ఆరు మోటార్ సైకిళ్లు స్వాధీనపరుచుకున్నట్టు ఉయ్యూరు సీఐ హబీబ్ బాషా తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, పట్టణంలో కొద్దిరోజులుగా బైక్ దొంగత నాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేసి ఇతనిని పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపి నట్టు తెలిపారు. పట్టణ ఎస్సై గణేశ్‌కుమార్ పాల్గొన్నారు.

పాడిరైతు ఆరోగ్య భద్రతకు కృషి

విజయ చైర్మన్ చలసాని ఆంజనేయులు



యాంజియోగ్రామ్ చేయించుకున్న పాడిరైతులతో డాక్టర్ గుంటూరు వరుణ్, చలసాని ఆంజనేయులు

హనుమాన్‌జంక్షన్/ రూరల్, ఫిబ్రవరి 26 : పాడిరైతు కుటుంబాల ఆర్థికాభివృద్ధితో పాటు ఆరోగ్య భద్రతకు కృష్ణామిల్క్ యూనియన్ కృషి చేస్తుందని చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. కాకులపాడు, వైకుంఠ లక్ష్మీపురం, రంగయ్యప్పారావుపేట, తదితర గ్రామాలకు చెందిన 12మంది పాడిరైతులకు వరుణ్ కార్డియాక్ అండ్ న్యూరో సైన్సెస్ సహకారంతో కృష్ణామిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఉచిత గుండె వైద్య పరీక్షలో యాంజియోగ్రామ్ అవసరమైన వారికి సోమవారం యాంజియోగ్రామ్ పరీక్షలు నిర్వహించారు. వారిని చైర్మన్ చలసాని ఆంజనేయులు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్ వరుణ్‌ని సంప్రదించారు. కృష్ణామిల్క్ యూనియన్ అభివృద్ధిలో సహకరిస్తూ పాడి పరిశ్రమకు మూలస్థంభాలైన పాడిరైతు కుటుంబాలకు అండగా నిలచేలా, ఆరోగ్యంతో మరింత పురోభివృద్ధి సాధించేలా కృష్ణామిల్క్ యూనియన్ అన్ని విధాలుగా చేయూత అందిస్తుందని చలసాని తెలిపారు.

టీడీపీ ఫ్లెక్సీల చించివేత



నందమూరులో చించివేసిన ఫ్లెక్సీ వద్ద ఆందోళన చేస్తున్న టీడీపీ నాయకులు

ఉంగుటూరు, ఫిబ్రవరి 26 : మండలంలోని నందమూరు, చాగంటిపాడు గ్రామాల్లో టీడీపీ కార్యకర్తలు, అభిమానులు ఏర్పాటు చేసిన ఐదు భారీ ఫ్లెక్సీలను ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చించివేశారు. సోమవారం ఉదయం చిరిగిన ఫ్లెక్సీలను చూసి అవాక్కయిన టీడీపీ నేతలు ఈ చర్యలను నిరసిస్తూ ఆయా గ్రామాల్లో చించివేసిన ఫ్లెక్సీల వద్ద ఆందోళన చేపట్టారు. మండల పార్టీ అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆళ్ల హనోక్‌లు ఆయా గ్రామాల్లో పర్యటించి చించివేసిన ఫ్లెక్సీలను పరిశీలించారు. ఐదు ఫ్లెక్సీలను చించివేయటంతో ఆగ్రహం వ్యక్తం చేసిన నాయకులు నందమూరులో అనగాని సురేష్ చారిటబుల్ ట్రస్ట్ ఎదురుగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ వద్ద గ్రామ పార్టీ నాయ కులతో కలిసి ఆందోళన నిర్వహించారు. ఘటనపై టీడీపీ నాయకులు ఉంగుటూరు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరా ఫుటేజ్‌లో లభ్యమైన ఆధారాలను ఎస్సై వి.రవిచంద్రకుమార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో నందమూరు గ్రామ పార్టీ అధ్యక్షుడు గుడ్డేటి పోతురాజు, తుమ్మల సాయి, అనగాని సురేష్, రమేష్, మునేశ్వరరావు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కలగానే సొంతింటి నిర్మాణం

- ఉపాధి సొమ్ము కోసం పేదల ఎదురుచూపు
- బాపులపాడు మండలంలో 2,656 పేదల గృహాలకు గాను 370 మందికి మాత్రమే వేతనం చెల్లింపు
- అయోమయంలో 2,286 మంది లబ్ధిదారులు
- పెరిగిన ధరలతో మధ్యలోనే నిలిచిపోతున్న పేదల ఇళ్ల నిర్మాణం
- ఉపాధి పథకం అధికారుల తీరుపై మండిపాటు



బాపులపాడు పేదల కాలనీలో ఇంటికి బేస్‌మెంట్ వేస్తున్న కూలీలు

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 26 : పేదల కాలనీల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులకు దశలవారీగా అందించాల్సిన ఉపాధి హామీ పథకం సొమ్ము అందక లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇంటి నిర్మాణం పూర్తి చేసిన పేదలకు కేంద్ర ప్రభుత్వం అందించే రూ.1.50 లక్షలు మెటీరియల్, నగదు కాంపొనెంట్ సొమ్ముతో పాటు ఉపాధి హామీ పథకం కింద ప్రతి లబ్ధిదారుడికి 90 రోజులు వేతనంగా రూ.24, 480లు, మరుగుదొడ్డి నిర్మాణానికి మరో రూ.12వేలు కలిపి రూ1.86,480లు చెల్లించాల్సి ఉంది. ఇంటి నిర్మాణం పూర్తి చేసినా వేతనం సొమ్ము మాత్రం అందకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. రోజుకు రూ. 270లు చొప్పున 90 పనిదినాలకు రూ.24, 480లు చెల్లిం చాల్సి ఉంది. దశల వారీగా చెల్లించాల్సిన సొమ్మును సకాలంలో చెల్లించకపోడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాపులపాడు మండలంలో 4500 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేయగా అందులో 2020-21లో 2,656 ఇళ్లు మంజూరయ్యాయి. ఇందు లో 623 మాత్రమే నిర్మాణం పూర్తి చేశారు. మిగిలిన 2,033 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. దశలు వారీగా వేతనం సొమ్ము అందించాల్సి ఉంది. కాని ఉపాధి హామీ పథకం అధికారులు తీరు వింతగా ఉంది. హౌసింగ్ శాఖ 2,656 గృహాలను మంజూరు చేస్తే మండల ఉపాధి హామీ పథకం అధికారులు మాత్రం 1,400 గృహాలకు మాత్రమే వేతనం సొమ్ము అంచనాలు తయారు చేసి ప్రతిపాదనలు పంపగా 1,085 గృహాలు మంజూరు చేశారు. 623 గృహాలు నిర్మాణం పూర్తి చేయగా ఇప్పటికి 370 ఇళ్లకు మాత్రమే పూర్తి వేతన సొమ్ము చెల్లించారు. దీంతో 2,286 మంది లబ్ధిదారులకు వేతనం సొమ్ము అందక ఎదురు చూస్తున్నారు. ఉపాధి వేతనం సొమ్ము వస్తుందో రాదో తెలియని అయోమయ పరిస్థితిలో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. పేదల ఇళ్ల నిర్మాణ వ్యయం భారీగా పెరిగిపోయింది. నిర్మాణానికి కనీసంగా రూ.6 నుంచి 8లక్షలు అవుతోంది. ప్రభుత్వం అందించే రూ.1.50 లక్షలు ఆర్థికసాయం చాలక లబ్ధిదారులు అప్పులు చేసి నిర్మాణం పూర్తి చేస్తున్నారు. ఇళ్లులేని పేదలు అద్దెలు భరించలేక సొంత ఇంటి నిర్మాణం పూర్తి చేయడానికి నానా తంటాలు పడుతున్నారు. ప్రభుత్వం అందించే కొద్దిపాటి వేతన సొమ్మును అధికారులు సకాలంలో అందిస్తే ఆసరాగా ఉంటుందని పలువురు లబ్ధిదారులు వాపోతున్నారు.

పోలీసులను అడ్డుపెట్టుకుని అధికారం చెలాయిస్తున్నారు

వైసీపీ నాయకుల తీరుపై మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆగ్రహం



పోలీస్‌స్టేషన్‌లో ఉన్న టీడీపీ కౌన్సిలర్లు, నాయకులతో మాట్లాడుతున్న బోడె ప్రసాద్

ఉయ్యూరు, ఫిబ్రవరి 26 : పోలీసులను అడ్డుపెట్టుకుని వైసీపీ నాయకులు అధికారం చెలాయిస్తున్నారని, టీడీపీ పెనమలూరు ఇన్‌చార్జి బోడె ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల సమావేశం నుంచి బలవంతంగా పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చిన పార్టీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలను సోమవారం కలుసుకుని వివరాలు తెలుసుకున్నారు. టిడ్కో ఇళ్ల గురించి లబ్ధిదారుల తరపున అధికారులను అడిగేందుకు వెళ్లిన వారిని ఏ విధంగా తీసుకువచ్చి నిర్బంధిస్తారని సీఐ హబీబ్ బాషాను ప్రశ్నించారు. కమిషనర్ ఆహ్వానం మేరకు సమావేశానికి వెళ్లిన కౌన్సిలర్లను అరెస్టు చేసి తీసుకు వస్తారా అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా బోడె ప్రసాద్ మాట్లాడుతూ, ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో మంత్రి జోగి రమేశ్ టిడ్కో ఇళ్లుపూర్తిచేసి ఇస్తామని మరో నాటకానికి తెర లేపారని, గృహ నిర్మాణ శాఖ మంత్రిగా ఉండి ఇప్పటివరకు నిర్మాణం ఎందుకు పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించలేదని ప్రశ్నించారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి..

ఉయ్యూరు పట్టణం, మండల పరిధి గ్రామాల నుంచి పలువురు వైసీపీ నాయకులు సోమవారం టీడీపీలో చేరారు. నగర పంచాయతీ చైర్మన్ వల్లభనేని వెంకటేశ్వరరావుతో పాటు 2వ వార్డు కౌన్సిలర్ వి సుభద్రాదేవి, 3వ వార్డు కౌన్సిలర్ తెనాలి పద్మ, 7వ వార్డు కౌన్సిలర్ వడుపు గంగాభవాని, 13వ వార్డు కౌన్సిలర్ ఫైలా శ్రీనివాసరావు, 14వ వార్డు కౌన్సిలర్ కోరాడ వెంకటలక్ష్మి, 18వ వార్డు కౌన్సిలర్ నూర్జహాన్, కో-ఆప్షన్ సభ్యురాలు అడపాక ఆదిలక్ష్మి టీడీపీలో చేరారు. ముదునూరు సర్పంచ్ మొవ్వ వెంకటలక్ష్మి, కాటూరు సర్పంచ్ కొడాలి ఆశాజ్యోతి, కాటూరు ఎంపీటీసీ తోట శ్రీలక్ష్మితో పాటు పీఏసీఎస్ మాజీ చైర్‌పర్సన్లు, నాయకులు చంద్రబాబు నాయుడు, లోకేశ్ సమక్షంలో మంగళగిరిలో టీడీపీ కండువా కప్పుకున్నారు.

టీడీపీ విజయానికి కృషి

●కమ్మ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్

కంకిపాడు, ఫిబ్రవరి 26 : రాష్ట్రంలో తెలుగుదేశం విజయానికి సమష్టిగా కృషి చేస్తానని కమ్మ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్ (బుడ్డి) అన్నారు. పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథితో కలిసి సోమవారం ఆయన చంద్రబాబు నాయుడు, నారా లోకేష్‌లను కలిశారు. అనంతరం కోలవెన్నులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చంద్రశేఖర్ మాట్లాడుతూ, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఈ ఐదేళ్లు గుడ్డిగా నమ్మామన్నారు. నియోజక వర్గంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన్ టిడ్కో ఇళ్లు పేదలకు పంపిణీ చేయలేదన్నారు. కులానికో కార్పొరేషన్ ఏర్పాటు చేశారే తప్ప నిధులు, విధులు ఇవ్వలేదని మండిపడ్డారు. తాము కమ్మ కార్పొరేషన్ చైర్మన్‌గా ఉన్న పదవీ కాలంలో ఏ ఒక్కరికైనా లబ్ధి చేకూర్చామా అన్న ఆత్మపరిశీలన చేసుకుంటే అంతా అంధకారమే అన్నారు. చంద్రబాబు నాయుడు అధికా రంలోకి వస్తే సంక్షేమ పథకాలు రద్దు చేస్తారంటూ అధికార పార్టీ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సంక్షేమంతో పాటు అభివృద్ధి చంద్రబాబు నాయుడు ప్రధాన లక్ష్యమని, ఆయన విజన్ ఉన్న నాయకుడు అని ఆయన వెంటే నడుస్తామని బుడ్డి అన్నారు. పెనమలూరు, నూజివీడుతో పాటు రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల విజయవానికి సమిష్టిగా కృషి చేస్తామని చెప్పారు. తనతో పాటు తెలుగుదేశం పార్టీలో చేరిన కంకిపాడు మండలానికి చెందిన ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మీ, వైసీపీ మండల అధ్యక్షుడు మద్దాలి రామచంద్రరావు, వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి బండి నాంచారయ్య, బుడ్డి యువ సేన అధ్యక్షుడు కొప్పరాజు సురేష్, కంకిపాడు వైస్ ఎంపీపీ దూళిపూడి కిషోర్, ఎంపీటీసీ బండి శ్రీను, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు పటాకుల శ్రీను, మాజీ సర్పంచ్ చెన్నుబోయిన జయ రామ్, పునాదిపాడు సర్పంచ్ భర్త మునిబోయిన వెంకటేశ్వరరావు, సారథి యువత గుమ్మడి కిరణ్, రామ్‌లక్ష్మణ్, విజయ్ తదితరులు వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారిలో ఉన్నారు.

విద్యార్థులకు శాస్త్రీయ అవగాహన అవసరం

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 26: సైన్సు విజ్ఞానం పట్ల విద్యార్థుల్లో ఆసక్తి పెరిగినపుడే శాస్త్రీయ అవగాహన పెరుగుతుందని మానవత రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక మానవత కార్యాలయంలో సైన్సుడేను పురస్కరించుకొని హైస్కూల్ విద్యార్థులకు ఆర్టిఫిసియల్ ఇంటిలి జెన్స్ అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.ఈ పోటీల్లో వేలేరు జడ్పీ హైస్కూల్ విద్యార్థిని ఎస్.లిఖిత ప్రథమ స్థానం,వీరవల్లి హైస్కూల్ విద్యార్థిని సీహెచ్. సునీత, తృతీయ స్థానం జ్యోతి హైస్కూల్ విద్యార్థి కె.లోక్‌పవన్ ఎంపికైయ్యారు. వీరికి ఈ నెల 28న సైన్సుడే సందర్భంగా నగదు బహుమతులు అందజేయనున్నట్లు మారుబోయిన తెలిపారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 26 : ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం ప్రభుత్వం మార్చి 3న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని గ్రామ సచివాలయాల్లో విజయవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని బాపులపాడు ఎంపీడీవో కె.రత్నకుమారి తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో గ్రామ సచివాలయ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.

మోదీ గద్దె దిగే వరకూ పోరాటం

ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మాగంటి హరిబాబు



రైతు ఉద్యమానికి సంఘీభావంగా గన్నవరంలో ట్రాక్టర్ ర్యాలీ చేస్తున్న నాయకులు

గన్నవరం, ఫిబ్రవరి 26 : దేశంలో రైతులు, కార్మికుల జీవితాలతో ఆటలాడుతున్న మోదీ ప్రభుత్వం గద్దె దిగే వరకూ పోరాటం తప్పదని, అందుకు రైతాంగం పెద్ద ఎత్తున రోడ్ల మీదకి రావాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మాగంటి హరిబాబు అన్నారు. ఢిల్లీలో రైతాంగం చేస్తున్న పోరాటానికి వ్యతిరేకంగా మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై క్విట్ ప్రపంచ వాణిజ్య ఒప్పందం నిరసన కార్యక్రమంలో భాగంగా సోమవారం రైతు సంఘాలు, కార్మిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో గన్నవరంలో ట్రాక్టర్, బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మూడు బొమ్మల సెంటర్‌లో జరిగిన సభలో హరిబాబు మాట్లాడుతూ, కేంద్రంలో మోదీ ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలను నెర వేర్చనందుకే అన్నదాతలు రెండవ దఫా పోరాటాన్ని ప్రారంభించారని తెలిపారు. స్వామి నాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం పంటలకు కనీస మద్దతు ధర చట్టం చేయాలని, భారత రైతులకు వ్యతిరేకంగా ఉన్న డబ్ల్యూటీవోను బహిష్కరించాలన్నారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.యలమందారావు మాట్లాడు తూ రైతు మృతికి కారణమైన హర్యానా పోలీసులపై క్రిమినల్ కేసులు పెట్టాలన్నారు. పంట ఉత్పత్తులకు సీ2 ప్లస్ 50 సూత్రాన్ని నమోదు చేయాలని, పంట రుణాలు మాఫీ చేయాలని, విద్యుత్ రంగ సంస్కరణలు నిలిపివేయాలని, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అమలు చేయాలని అడిగిన రైతులపై రబ్బర్ బుల్లెట్లతో కాల్చటం, బాష్పవాయువు గోళాలను ప్రయోగించటం దుర్మార్గమన్నారు. వైసీపీ ప్రభుత్వ మీడియాపై విచక్షణ రహితంగా వరుస దాడులకు పాల్పడుతూ ప్రజాస్వామ్యాన్ని పూర్తి అపహాస్యం చేస్తుందన్నారు. సీఐటీయూ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి వై.నరసింహారావు, ముక్కామల ఉమామహేశ్వరరావు, టీవీ లక్ష్మణ స్వామి, కళ్లం వెంకటేశ్వరరావు, మల్లంపల్లి ఆంజనేయు లు, బడుగు మరియదాసు, సూరగాని సాంబశివరావు, కాట్రగడ్డ రామచంద్రజోషి, మలంపల్లి జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మద్దూరులో ప్రచారం నిర్వహిస్తున్న బోడె వెంకట్రామ్

మద్దూరు (కంకిపాడు), ఫిబ్రవరి 26 : రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కుమారుడు బోడె వెంకట్రామ్ అన్నారు. కంకిపాడు మండలంలోని మద్దూరు గ్రామంలో మూడవ రోజు నిర్వహించిన బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకట్రామ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు సైనికుల్లా పనిచేయాలన్నారు. చంద్రబాబునాయుడు సీఎం అయితే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు అవుతాయని తెలిపారు. చంద్రబాబు నాయుడు ప్రవేశ పెట్టిన ఆరు గ్యారెంటీలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గొంది శివరామకృష్ణ ప్రసాద్, గ్రామ పార్టీ అధ్యక్షుడు మదన్ మోహన్, ఆరేపల్లి గోపి, వల్లే నరసింహారావు, తీట్ల మధు, వంశీ, నాగ య్య, ఈడే రఘు, వడుగు మాణిక్యరావు, రావి శ్రీని వాసరావు, మన్నే శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కోడూరుపాడులో రైల్వే అండర్‌పాస్ ప్రారంభం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 26 : ప్రమాద నివారణతో పాటు గ్రామస్తుల సౌకర్యార్థం కోడూరు పాడులో నిర్మించిన రైల్వే అండర్‌పాస్‌ను ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా సోమవారం మధ్యాహ్నం ప్రారంభించారు. విజయవాడ-విశాఖపట్నం సెక్షన్‌లో ఎల్‌సీ నెం. 330 లెవల్ క్రాసింగ్ వద్ద అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా నిర్మించిన అండర్ పాస్‌ను కేంద్ర రైల్వేశాఖ అధికారుల ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధుల సమక్షంలో జాతికి అంకితం చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ, టీడీపీ ప్రజాప్రతినిధులుతో పాటు ఈఈ(వర్క్స్) వి.రవికుమా ర్, వి.సత్యప్రసాద్, డి.కిరణ్‌కుమార్, సీహెచ్ జీ.ఏగణేష్, అంజనీకుమార్, శ్రీనివాసరావు, తదితర రైల్వే అధికారులు, రైతు నాయకులు ఆళ్ల గోపాలకృష్ణ, వేములపల్లి శ్రీనివాసరావు, గుండపనేని ఉమా వరప్రసాద్, కొండపల్లి వెంకన్న పాల్గొన్నారు.

తేలప్రోలులో

ఉంగుటూరు : రైల్వేస్టేషన్ల అభివృద్ధి, ఆధునీకరణలో భాగంగా అత్యాధునిక హంగులతో రూపుదిద్దుకుంటున్న రైల్వే ఓవర్ బ్రిడ్జిలు, అండర్ పాస్‌లతో రైల్వే ముఖచిత్రం మారుతుందని దక్షిణమధ్య రైల్వే విజయవాడ డివిజన్ ఏడీఎంఎం టి.దేవేంద్రస్వామి అన్నారు. అమృత్ భారత్‌స్టేషన్ పథకంలో భాగంగా దేశంలోని 554 రైల్వేస్టేషన్లను పున రాభివృద్ధిపరచడం తోపాటు, 1500 రైల్వే ఓవర్‌బ్రిడ్జిలు/అండర్‌పాస్‌లు నిర్మాణాలు పూర్తి చేశారు. వాటిని భారత ప్రధాని నరేంద్రమోదీ సోమవారం వర్చువల్ విధానంలో లాంఛనంగా ప్రారంభించి జాతికి అంకితం చేశారు. ఇందులో భాగంగా విజయవాడ-విశాఖపట్నం రైల్వేరూటులో ఉంగుటూరు మండలం, తేలప్రోలు శివారు కొత్తూరు లెవల్ క్రాసింగ్ గేటు (నెం.328)వద్ద రూ.6.71కోట్లతో నూతనంగా నిర్మించిన అండర్‌పాస్ బ్రిడ్జి, ఫలకాన్ని ఎంపీపీ వడ్లమూడి సరోజిని, రైల్వే అధికారులతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ లాం దిబోర, ఎంపీటీసీ సభ్యులు టి.వాణి, ఎస్. మేరీ, పొట్టిపాడు గ్రామపెద్దలు కె.సుభాష్ చంద్రబోస్, రైల్వేశాఖ అధికారులు పాల్గొన్నారు.



తేలప్రోలు శివారు కొత్తూరులో అండర్‌పాస్ బ్రిడ్జి ఫలకాన్ని ప్రారంభిస్తున్న రైల్వే అధికారులు

వీరవల్లి వద్ద ఆర్వోబీ త్వరితగతిన నిర్మించాలి



రైల్వే ఏడీఈ సంతోష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు నాయకులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 26 : ప్రజా ప్రయోజనాల దృష్ట్యా, మల్లవల్లి పారిశ్రామికవాడ అభివృద్ధి కోసం వీరవల్లి వద్ద ఎల్‌సీ నెం, 331 వద్ద ఆర్వోబీ నిర్మాణ పనులు త్వరతగతిన ప్రారంభించాలని కోరుతూ, రైల్వే ఏడీఈ సంతోష్‌కుమార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. విజయవాడ- విశాఖపట్నం సెక్షన్‌లో రాష్ట్రానికే తలమానికమైన మల్లవల్లి పారిశ్రామికవాడను, ఎస్.ఎస్.ఎల్, మోహన్ స్పింటెక్స్ లాంటి భారీ పరిశ్రమలకు అనుసంధానించే రహదారిపై వీరవల్లి వద్ద గల రైల్వేగేటు స్థానంలో ఆర్వోబీ నిర్మించాలని, రద్దీ సమయాల్లో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్థంభించడం వల్ల ప్రయాణికులతో పాటు స్థానిక ప్రజలు కూడా ఇబ్బందులెదుర్కొంటున్నారని వినతిపత్రంలో కోరారు. దీనితోపాటుగా వేలేరు ఎస్సీ కాలనీ వద్ద గల ఎల్‌సీ నెం. 334వద్ద గ్రామస్తులకు ఇబ్బంది లేకుండా అండర్‌పాస్ ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)



బ్రాయిలర్ బర్డ్	159, 168, 179
చికెన్ విత్ స్కిన్	308
చికెన్ స్కిన్‌లెస్	316

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.75

వేదవ్యాస్‌ను కలిసిన కాగిత



మచిలీపట్నం టౌన్ , ఫిబ్రవరి 26 : పెడన అసెంబ్లీ టికెట్ రాలేదని మనస్తాపంతో అస్వస్థతకు గురైన మాజీ డిప్యూటీ స్పీకర్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్‌ను సోమవారం పెడన నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కాగిత కృష్ణ ప్రసాద్ కలిసి మాట్లాడారు. తన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా కోరారు. టికెట్ రాక మనస్తాపం చెందిన వారి ఇళ్లకు వెళ్ళి మాట్లాడి, అనుకూలంగా మరల్చుకోవాలని చంద్రబాబు సూచించారు. ఈ నేపథ్యంలోనే కాగిత కృష్ణప్రసాద్ బందరులో వేదవ్యాస్‌ను కలిశారు.

స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించండి

● జేసీ గీతాంజలి శర్మ



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జేసీ గీతాంజలి శర్మ

మచిలీపట్నం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జేసీ గీతాంజలి శర్మ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లోని స్పందన సమావేశపు హాలులో సోమవారం అధికారులతో కలసి ప్రజలనుంచి ఆమె అర్జీలు స్వీకరించారు. జేసీ మాట్లాడుతూ అర్జీలను పూర్తిస్థాయిలో పరిశీలనచేసి నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. పామర్రుమండలం గాంధీనగర్ రామాలయం వద్ద పుల్లేరుకాలువను కొంతమంది ఆక్రమించి పొలాలకు సాగునీరు రాకుండా అడ్డుకుంటున్నారని, చర్యలు తీసుకోవాలని రైతులు అర్జీ అందజేశారు. తనకు వారసత్వంగా వచ్చిన భూమికి పట్టా మంజూరు చేయాలని కోరుతూ కృత్తివెన్ను మండలం చినపాండ్రాకకు చెందిన అబ్దుల్ ఖాదర్ అర్జీ అందజేశారు. డీఆర్వో చంద్రశేఖరరావు, డీఎంఅండ్‌హెచ్‌వో గీతాభాయి, వ్యవసాయశాఖ జేడీ పద్మావతి, అధికారులు పాల్గొన్నారు.

కమిషనర్ మహేంద్రకు పెడన కౌన్సిల్ నివాళి

పెడన : కమిషనర్ మహేంద్ర ఉత్తమ సేవలందించారని చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అన్నారు. ఆదివారం మృతి చెందిన కమిషనర్ మహేంద్ర సంస్మరణ సభ సోమవారం కౌన్సిల్ సమావేశపు హాలులో జరిగింది. తొలుత మహేంద్ర చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన మృతికి సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. వైస్ చైర్మన్ ఎండి ఖాజా, కౌన్సిలర్లు కటకం ప్రసాద్, కొనసం కరుణకుమారి, మట్టా శివపావని, సిరివెళ్ళ జయేష్, బాబూలాల్, ఇన్‌చార్జి కమిషనర్ ఏసుబాబు, మేనేజర్ వాసా యోగేశ్వరరావు, ఆర్ఐ పామర్తి వెంకటేశ్వరరావు, కె.డి.ఎస్. సుందరం, పెద్దిరాజు, పామర్తి జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి సేవలో రేంజ్ డీఐజీ అశోక్ కుమార్



కోడూరు : హంసలదీవి వేణుగోపాలస్వామిని సోమవారం ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్ కుమార్ దర్శించుకున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం వేద పాఠశాల ప్రిన్సిపాల్ కుప్పా సుబ్రహ్మణ్యం అవధాని వేణుగోపాలస్వామి ఆలయం విశిష్టతను వివరించారు. హంసలదీవి బీచ్ వద్దకు వెళ్లి అక్కడ పరిస్థితులను తెలుసుకున్నారు. అవనిగడ్డ డిఎస్పీ మురళీధర్, సీఐ త్రినాథ్, కోడూరు ఎస్సై శిరీష ఉన్నారు.



గుడివాడ 11వ వార్డులో పర్యటిస్తున్న వెనిగండ్ల రాము, రావి, యలవర్తి



ఐలూరు పల్లెబాట కార్యక్రమంలో వర్ల కుమార్ రాజా

చంద్రబాబు పాలనలోనే అన్ని వర్గాలకు మేలు

గుడివాడ, ఫిబ్రవరి 26 : అన్ని వర్గాలకు ప్రత్యేకించి మైనార్టీలకు చంద్రబాబు పాలనలోనే మేలు జరుగుతుందని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని 11, 12 వార్డుల్లో బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. వార్డులో ఇంటింటికి వెళ్ళి ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తొలుత 11వ వార్డులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పవిత్ర జెండా చెట్టు వద్ద గంధం సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వెనిగండ్ల మాట్లాడుతూ పట్టణంలో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ సమస్యలను ఎమ్మెల్యే కొడాలి నాని పట్టించుకోవడం లేదని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, యలవర్తి శ్రీనివాసరావు, బూరగడ్డ శ్రీకాంత్, దింట్యాల రాంబాబు, మజ్జి శ్రీనివాసరావు, షేక్ ఇబ్రహీం, స్థానిక నాయకులు సయ్యద్ జబీన్, షేక్ కరీముల్లా, పట్టపు చిన్నా, ఆలీ, ఇర్ఫాన్, యాసిన్, బారీ, బాబు, తలారి వేణు, పట్టపు శ్రీను, వేణు, మోబీన్, చంద్ర, భాగ్యం, సలోమి, అస్మా, బాజీ, నాగరాజు, రియాజ్, సమీ, అక్బర్, ఇక్రం, ఖలీల్ పాల్గొన్నారు.



అభివృద్ధి చేయని కమ్యూనిటీ హాల్ వద్ద వెనిగండ్ల సెల్ఫీ

కొడాలి నానికి సెల్ఫీ చాలెంజ్

గుడివాడ : పేదలకు అవసరమయ్యే కమ్యూనిటీ హాల్‌ను పూర్తి చేయాలనే ఆలోచన కూడా ఎమ్మెల్యే నానికి లేకపోవడం బాధాకరమని వెనిగండ్ల రాము ధ్వజమెత్తారు. సోమవారం 11వ వార్డులో మున్సిపాల్టీ ఆధ్వర్యంలో నిర్మించిన కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ పనులపై ఆయన ఎమ్మెల్యే నానికి సెల్ఫీ చాలెంజ్ విసిరారు. వెనిగండ్ల రాము మాట్లాడుతూ టీడీపీ హయాంలో పూర్తి చేసుకున్న భవనానికి కనీసం రంగులు వేసి, చిన్నపాటి పనులను పూర్తి చేయడానికి ఎమ్మెల్యే కొడాలి నానికి ఐదేళ్ల సరిపోలేదని ఎద్దేవా చేశారు. ఎంపీ బాలశౌరి తెచ్చిన కేంద్ర నిధులతోనే ప్రస్తుతం గుడివాడలో పనులు జరుగుతున్నాయన్నారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, సయ్యద్ జబీన్ తదితరులు పాల్గొన్నారు.



వేమూరి రాజబాబును పార్టీలోకి ఆహ్వానిస్తున్న కాగిత

మడకలో టీడీపీలో చేరికలు

పెడన రూరల్ : మడక గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త పంచకర్ల సురేష్‌తో కలసి కాగిత కృష్ణప్రసాద్ నిర్వహించారు. మాజీ నీటి సంఘం అధ్యక్షుడు వేమూరి రాజబాబు తదితరులు కాగిత సమక్షంలో టీడీపీలో చేరారు. పార్టీ పరిశీలకులు సాదరబోయిన ఏడుకొండలు, అర్జా నగేష్, శలపాటి ప్రసాద్, శీరం ప్రసాద్, జోగి సుబ్బయ్య, జోగి వెంకటేశ్వరరావు, రాజులపాటి సుబ్రహ్మణ్యం, ర్యాలీ సత్యన్నారాయణ, నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

కైలేకి రూ.కోట్ల ఆస్తులెలా వచ్చాయి?

తోట్లవల్లూరు : గన్నవరం నుంచి ట్రంకుపెట్టెతో పామర్రు వచ్చి ఎమ్మెల్యే అయిన కైలే అనిల్‌కుమార్ కోట్లాది రూపాయల ఆస్తులెలా వచ్చాయో ప్రజలకు సమాధానం చెప్పాలని పామర్రు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వర్ల కుమార్ రాజా డిమాండ్ చేశారు. ఐలూరు, గుర్విందపల్లి గ్రామాల్లో 22వ రోజు పల్లెబాట కార్యక్రమం నిర్వహించారు. కుమార్ రాజా మాట్లాడుతూ గ్రామాల్లో రోడ్లు కూడా వేయలేదని, ఇసుక మాఫియాను మాత్రం తయారు చేశాడని ఆరోపించారు. వీరంకి వెంకట గురుమూర్తి, వీరపనేని శివరామ్‌ప్రసాద్, నర్రా వెంకట అప్పారావు, నెక్కలపూడి మురళీ, దావులూరి చినబాబు, వీరబాబు, శివరామకృష్ణ, లుక్కా రేణుకారావు తదితరులు పాల్గొన్నారు.



బందరులో జ్యోతి వెలిగిస్తున్న ఏడీఎం ప్రకాశరావు, గుడివాడ స్టేషన్లో మాట్లాడుతున్న కిషోర్

బందరు, గుడివాడ రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ పనులు ప్రారంభం

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 26 : అమృతభారత్ లో భాగంగా రూ.27 కోట్లతో మచిలీపట్నం రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులను ప్రారంభించారు. ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం వర్చువల్‌గా మచిలీపట్నం రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులను ప్రారంభించారు. మేయర్ వెంకటేశ్వరమ్మ, సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ ఏడీఎం కె. ప్రకాశరావు జ్యోతి వెలిగించి పనులను ప్రారంభించారు. స్టేషన్ మాస్టర్ వై.నాగేశ్వరరావు మాట్లాడుతూ, ప్రస్తుతం రైల్వేస్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి, లిఫ్టులు, ఎస్కలేటర్, మరో ఫుట్ ఓవర్ బ్రిడ్జితో పాటు మూడు ప్లాట్‌ఫాంలు, గ్రీనరీ, గార్డెన్ సర్క్యులేట్ డెవలప్‌మెంట్ పనులు జరుగుతాయన్నారు.డిప్యూటీ మేయర్ విజయలక్ష్మి, ముడా చైర్మన్ దుర్గా భవానీ, బీజేపీ నాయకుడు పంతం గజేంద్ర, బందెల థామస్ నోబుల్ పాల్గొన్నారు.

గుడివాడ రైల్వేస్టేషన్లో..

గుడివాడ : అమృత్ భారత్‌లో గుడివాడ రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ.26.78కోట్లు నిధులు మంజూరైనట్లు విజయవాడ సీనియర్ డివిజనల్ ఎన్విరాన్మెంటల్ హౌస్ కీపింగ్ మేనేజర్ యం.కిషోర్ తెలిపారు. దేశ ప్రధాని మోదీ 554 అమృత్ భారత్ స్టేషన్‌ల అభివృద్ధి పనులను వర్చువల్‌గా ప్రారంభించారు. రైల్వే స్టేషన్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో కిషోర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. బీజేపీ రాష్ట్ర నాయకులు రామినేని వెంకటకృష్ణ, జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు, స్టేషన్‌మాస్టర్ డి.రమేష్‌బాబు, సీసీఐ భగవాన్ నాయక్, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణారావు, బీజేపీ నాయకులు సతీష్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు మొవ్వ జిల్లా పరిషత్ విద్యార్థుల ప్రాజెక్టు



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో తాహెరా సుల్తానా

మచిలీపట్నం టౌన్ : మచిలీపట్నం చిలకలపూడి మునిసిపల్ హైస్కూల్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి ఈఎండీపీ పోటీల్లో మొవ్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాజెక్టు ప్రథమ స్థానంలో నిలిచింది. పెదముత్తేవి ఓరియంటల్ హైస్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. ఎస్‌ఈఆర్‌టీ నిర్వహించిన ఈ పోటీల్లో ఎంపికైన విద్యార్థులు మార్చి 7న పోరంకిలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. నిమ్మకూరు రెసిడెన్షియల్ హైస్కూల్ విద్యార్థుల ప్రాజెక్టు మూడో స్థానంలో నిలవగా ఇందుపల్లి జడ్పీ హైస్కూల్ విద్యార్థుల ప్రాజెక్టు నాల్గో స్థానంలో నిలిచింది. ఆరుగొలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రాజెక్టు ఐదో స్థానంలో నిలిచింది. విజేతలకు డీఈవో తాహెరా సుల్తానా బహుమతులు అందచేశారు. సైన్స్ ఆఫీసర్లు షేక్ జాన్ సాహెబ్, ఐ. పద్మారాణి, డీఎస్‌వో మహమ్మద్ జాకీర్ అహ్మద్, జె. భానుకిరణ్ పాల్గొన్నారు.

భక్తాంజనేయస్వామి విగ్రహం, ధ్వజస్తంభం ప్రతిష్ఠ



తోట్లవల్లూరు, ఫిబ్రవరి 26 : దేవరపల్లిలోని కోదండరామస్వామి దేవస్థానంలో సోమవారం నూతన ధ్వజస్తంభం, భక్తాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ వైభవోపేతంగా జరిగాయి. అద్దేపల్లి ఫణిభూషణ మంగాచార్యులు ఆధ్వర్యంలో ప్రతిష్ఠను కనుల పండువగా నిర్వహించారు. వేలాదిగా భక్తులు హాజరయ్యారు. భారీ అన్నసమారాధన నిర్వహించారు. పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు.



చేనేత కార్మికుల పింఛను పునరుద్ధరించాలి

మచిలీపట్నం టౌన్ : రద్దయిన చేనేత కార్మికుల పింఛన్లను వెంటనే పునరుద్ధరించాలని సీపీఐ నేత మోదుమూడి రామారావు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద చేనేత కార్మిక సంఘం నాయకులు బి.బాలసుబ్రహ్మణ్యం, కట్టా హేమసుందరరావు, యక్కల పీతాంబరరావు, టి.సిహెచ్. కొండయ్య, వై. విఘ్నేశ్వరరావు తదితరులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. రామారావు మాట్లాడుతూ, నూతన నిబంధనల వల్ల చేనేత కార్మికుల పింఛన్లు అందకుండా పోయాయన్నారు. 50 ఏళ్లు నిండిన ప్రతి చేనేత కార్మికుడికి గుర్తింపు కార్డు ఇచ్చి పింఛను అందజేయాలన్నారు.

దళితుల సమాధుల స్థలాన్ని కాపాడాలంటూ ఆందోళన

గుడివాడ : రైలుపేటలో ఆక్రమణకు గురవుతున్న దళితుల సమాధుల స్థలాన్ని కాపాడాలంటూ మున్సిపల్ కార్యాలయం వద్ద దళిత సంఘాల నాయకులు సోమవారం ధర్నా నిర్వహించారు. గుడ్‌మెన్‌పేటకు చెందిన నాయకులు దళిత శ్మశానంలోని ఆక్రమణలను తామే స్వయంగా తొలగిస్తామని హెచ్చరించారు. మున్సిపల్ అధికారులు స్పందించి శ్మశాన స్థలంలో వేసిన సిమెంట్ పోల్స్, ఐరన్ రాడ్లతో కట్టిన ఫెన్సింగ్‌లను తొలగించారు. సర్వే చేయించి శ్మశాన స్థలానికి హద్దులను నిర్ణయిస్తామని మున్సిపల్ కమిషనర్ బాలసుబ్రహ్మణ్యం తెలిపారు.

జనసేన నేత పాపారావు మార్నింగ్ వాక్

ఘంటసాల : జనసేన పార్టీ నాయకులు చిలకలపూడి పాపారావు ఘంటసాలలో సోమవారం మార్నింగ్ వాక్ కార్యక్రమం నిర్వహించారు. ఘంటసాల ప్రధాన సెంటర్‌లో పలువురిని కలసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జనసేన పార్టీ సిద్ధాంతాలను తెలియజేస్తూ జనసేన - టీడీపీ ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఎంపీటీసీ సభ్యులు సిద్ధినేని కుమార్ రాజా, కోల్లపల్లి కిరణ్, యార్ల శ్రీకాంత్, ఆవుల వేణు, దుర్గా ప్రసాద్, ఆకుల మధు, ఆవుల మోహన కృష్ణ, వై.రవికిరణ్, మోపిదేవి మండల అధ్యక్షులు పూషడపు రత్నగోపాల్, బొప్పన పృధ్వీరాజ్, బాదర్ల లోలాక్షుడు, మత్తి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పామర్రు, కోడూరులో గంగానమ్మ సంబరం



పామర్రు : పామర్రు గంగానమ్మ జాతర సోమవారం వైభవంగా ప్రారంభమైంది. వేకువ జామున అమ్మవారికి 108 బిందెల చెరువు నీటితో స్నానాలు చేయించారు. పంబల వారి మేళతాళాలతో అమ్మవారి ఘటం, పోతురాజు గెడ ఆలయం నుంచి బయలుదేరి గ్రామ తొలి మునసబు కుటుంబీకులైన బొమ్మారెడ్డి మధుసూదనరెడ్డి ఇంటి నుంచి చల్ది నైవేద్యాన్ని స్వీకరించారు. అనంతరం పూర్వపు కరణం సుందర్‌రామయ్య ఇంటి వద్ద నైవేద్యాలను అందుకుని గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల బజారులో పొలిమేర ఆన కట్టుకట్టడి చేశారు. అమ్మవారి ఘటం, పోతురాజు గెడ ప్రతి గడపగడపకు తిరిగాయి. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



గంగానమ్మకు జలాభిషేకం

కోడూరు : కోడూరులో గంగానమ్మకు జలాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఆలయ 12వ పునఃప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమాల్లో భాగంగా సోమవారం ఆలయ ప్రధాన అర్చకులు కొమ్మూరు శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో మూలవిరాట్‌కు నవ విధ పూజలు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మంగళవారం ఆలయం వద్ద మహాచండీ యాగం, భారీ అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ కోట యుగంధరరావు తెలిపారు. భక్తులు పాల్గొన్నారు.



కోనేరు సెంటర్‌లో కార్మిక సంఘాల నేతల నిరసన ప్రదర్శన

గుడివాడలో సీపీఎం, సీపీఐ నేతల బైక్ ర్యాలీ

రైతాంగ నల్లచట్టాలను రద్దు చేయాలి

● కార్మిక సంఘాల ఆందోళన

మచిలీపట్నం టౌన్ : రైతాంగాన్ని నష్టపరిచే విధంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నల్ల చట్టాలను రద్దు చేయాలని కార్మిక సంఘం నేత బి.సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. సోమవారం కోనేరుసెంటర్‌లో ప్రదర్శన నిర్వహించారు. లక్ష్మీటాకీసు వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఏఐటీయూసీ నాయకులు మోదుమూడి రామారావు, కేవీపీఎస్ నాయకులు సిహెచ్. రాజేష్, ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం నాయకుడు చంద్రపాల్, ఏడుకొండలు, డి. సత్యనారాయణ, ఓ.ఎల్.రావు, వై. ఈశ్వరరావు, కె. చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బంటుమిల్లి : కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ బంటుమిల్లిలో రైతు కార్మిక సంఘాలు బైక్, ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించాయి. ప్రధాని మోదీ రైతాంగ, కార్మిక ప్రజావ్యతిరేఖ విధానాలను మానుకోకపోతే రానున్న ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

గుడివాడ : దేశ ప్రధాని మోడీ ఇచ్చిన హామిలను నేరవేర్చాలంటూ రైతులు నిర్వహిస్తున్న నిరసనకు మద్దతుగా సోమవారం పట్టణంలో రైతు, కార్మిక, మహిళా సంఘాలు బైక్ ర్యాలీ నిర్వహించాయి. సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు ఆర్‌సిపి రెడ్డి, గూడపాటి ప్రకాష్ బాబు, రైతు సంఘ నాయకులు శొంఠి ఉమామహేశ్వరరావు, చల్లగుళ్ళ సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఆనందరావు, సమరం, రేపాని కొండ, పి.రజిని పాల్గొన్నారు.